# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
## కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

**ఏప్రిల్ 10, 2022**

### కుల నిర్మూలన కోసం, పెట్టుబడిదారీ విధానానికి-సామ్రాజ్యవాదానికి, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేక సంకల్పంతో బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని జరపండి!

బ్రాహ్మణీయ హిందుత్వ మొండిఘటమైన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కు చెందిన భారతీయ జనతా పార్టీ, దాని ప్రభుత్వం తరఫున ప్రధాన మంత్రి మోదీ ఏప్రిల్ 14వ తేదీన అంబేద్కర్ జయంతిని ఘనంగా జరపవలసిందిగా ఇచ్చిన ప్రకటనలో బూటకత్వాన్ని అర్థం చేసుకోవలసిందిగానూ, కుల నిర్మూలన కోసం, పెట్టుబడిదారీ విధానానికి-సామ్రాజ్యవాదానికి, మొండిఘటమైన బ్రాహ్మణీయ హిందుత్వానికీ వ్యతిరేక సంకల్పంతో ఈ దినాన్ని జరుపుకోవలసిందిగానూ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) పిలుపునిస్తున్నది. బూటకపు చైతన్యంతోను, కుల నిర్మూలన, హిందుత్వ మత మనుధర్మశాస్త్రాన్ని, పెట్టుబడిదారీ విధానాన్ని వ్యతిరేకించాలన్న అంబేద్కర్ బోధనల అసలు సారాన్ని దళిత ప్రజలకు లేకుండా చేస్తూ అంబేద్కర్ జయంతిని జరపడం వెనుక హిందుత్వ ఫాసిస్టు శక్తుల కుట్రను మనం బహిర్గతపరచాలి.

పుట్టుక నాటి నుంచి కూడా ఆర్ఎస్ఎస్, భాజపా హిందుత్వ సంస్థలన్న విషయం తెలిసినదే. సైద్ధాంతిక అర్థంలోనే కాకుండా ఇవి అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని రోజువారీ జీవితంలో కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తాయి. బ్రాహ్మణీయ హిందుత్వ పాలక భాజపా గడచిన 8 సంవత్సరాలుగా భారతదేశాన్ని ఫాసిస్టు పద్ధతిలో మెట్టు మెట్టుగా నిర్మిస్తున్నది. దానికి ప్రజాకర్షకంగా 'నూతన భారతం' అన్న పేరు ఇచ్చింది. భాజపా ప్రభుత్వం దళిత, ఆదివాసీ, ముస్లిం, మహిళా వ్యతిరేక విధానాలను అమలు చేస్తుండడమే కాకుండా, నిరంతరం, ఎన్నడూ ఎరుగని విధంగా రైతాంగ, కార్మిక, మధ్య తరగతి వర్గాలకు వ్యతిరేకంగా విధానాలను తీవ్రతరం చేసింది. నిజానికి ఇవి కాషాయ రంగులో ఎల్‌పీజీ విధానాలే.

ఒక పక్క, త్రిపుల్ తలాక్ చట్టం చేస్తారు; 370, 35ఏ అధికరణాలను రద్దు చేస్తారు; అయోధ్యలో రామమందిరానికి శంకుస్థాపన చేశారు; దళిత, ఆదివాసీ ప్రజల రాజ్యాంగబద్ధ హక్కులను బహిరంగంగా ఉల్లంఘిస్తూ అనేక చట్టాలను తీసుకువచ్చేందుకు విఫలయత్నాలు చేస్తున్నారు; రిజర్వేషన్‌లను నిలిపివేయాలని, లేదా వివిధ మార్గాలలో అర్హులైన వారికి రిజర్వేషన్‌లు అందకుండా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు; గోరక్షణ పేరుతో మూక హత్యలు చేస్తున్నారు; దళిత, ఆదివాసీ ప్రజల ఆహార అలవాట్లు, జీవనం, ఆచార సంప్రదాయాలపై దాడి, నిషేధం, అవమానం చేస్తున్నారు; గుడ్డి రాష్ట్రీయోన్మాదంతో దళిత, ఆదివాసీ, మతపర అల్పసంఖ్యాక ప్రజలను, ముఖ్యంగా ఆడపిల్లలను చదువుకు దూరం చేస్తున్నారు; రైతు వ్యతిరేక, దేశద్రోహకర మూడు వ్యవసాయ చట్టాల ద్వారా దేశ వ్యవసాయాన్ని నాశనం చేసేందుకు విఫలయత్నం చేస్తున్నారు. ఇటువంటివే మరిన్ని ప్రజా వ్యతిరేక, దేశ వ్యతిరేక విధానాలను తీసుకువస్తున్నారు. మరో పక్క, అంబేద్కర్ జయంతిని జరుపుతున్నారు. పీడిత ప్రజలను, ముఖ్యంగా దళిత ప్రజలను హిందుత్వంలో భాగం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా అంబేద్కర్ జీవితాంతం పోరాడాడు. మనుధర్మశాస్త్రాన్ని కాలబెట్టిన అంబేద్కర్‌ను తమ చట్రంలో బిగించాలని మనువాదులు ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రయత్నాన్ని మనం తీవ్రంగా వ్యతిరేకించాలి.

దళిత, ఆదివాసీ ప్రజలకు కొద్ది పాటి హక్కులను అందించిన అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని తీవ్రంగా ఉల్లంఘించడమే కాకుండా భాజపా ప్రభుత్వం దాన్ని ముగించాలని కూడా చూస్తున్నది. ప్రస్తుత నేపథ్యంలో మనం అంబేద్కర్ ఈ విషయంలో అన్న మాటను గౌరవించాలి. రాజ్యాంగాన్ని సరైన పద్ధతిలో అమలు చేయకపోతే, రాజ్యాంగపర హక్కులను ఉల్లంఘిస్తే, దాన్ని తానే ముందుండి మంటలకు ఆహుతి చేస్తానన్నాడు.

పలువురు దళిత నాయకులు అంబేద్కర్ గురించి మాట్లాడతారు కానీ స్వార్థ ప్రయోజనాలతో భాజపా పక్షం వహిస్తారని చెప్పడం అసమంజసం కాదు. వారు ప్రభుత్వంలో భాగమై పీడక కులాల, వర్గాల సేవ చేస్తారు. పీడితులపై దోపిడీ, నిర్బంధాల అమలులో భాగమవుతారు. ఇటువంటి వ్యక్తులను ఎండగట్టడం, వ్యతిరేకించడం నేటి అవసరం.

వర్తమాన కుల ఆధారిత అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థను కూలదోసి, కుల వ్యవస్థను అంతం చేసేందుకు బలమైన పునాదిగా పని చేసే నూతన ప్రజాస్వామిక రాజ్యాధికారాన్ని నిర్మించడం కోసం, అంబేద్కర్‌ను తమ చట్రంలో బిగించాలన్న హిందుత్వ మొండిఘటాల ప్రయత్నాలను సాధ్యమయినన్ని రకాలుగా వ్యతిరేకించవలసిందిగా; బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు శక్తుల వ్యాప్తిని అరికట్టవలసిందిగా; కుల నిర్మూలనకు పరిమితం కాకుండా, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక వర్గ పోరాటం, ప్రజాయుద్ధంలో భాగం కావలసిందిగా మా పార్టీ యావత్తు పీడిత వర్గాలు, సామాజిక సెక్షన్‌లు, ముఖ్యంగా దళిత ప్రజలకు పిలుపునిస్తున్నది. అలాగే తమ స్వార్థ ప్రయోజనాల కోసం దళితులను భ్రమలలో ఉంచేందుకు, వారు ముందుకు సాగేందుకు సరైన మార్గాన్ని ఎన్నుకోనివ్వకుండా అడ్డుపడే ఎన్నికల రాజకీయాలలో ముందుకు వచ్చే వివిధ అవకాశవాద రాజకీయ పార్టీలు, శక్తుల ప్రయత్నాలను విఫలం చేయవలసిందిగా పిలుపునిస్తున్నది.

Abhay

**అభయ్**
**అధికార ప్రతినిధి**
**కేంద్ర కమిటీ**